

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**మై యే సోచ్ కర్ ఉస్ కె దర్ సే ఉఠాథా**

**కె వో రోక్ లేగి మనాలేగి ముఝ్ కో...**

భారతీయ చలనచిత్ర చరిత్రలో యుద్ధం ఆధారంగా నిర్మితమైన తొలి చలన చిత్రం 'హకీకత్ '. అంతకు ముందు 'డాక్టర్ కోట్నీస్ కీ అమర్ కహానీ ' సినిమా నేపథ్యం యుద్ధం అయినా అది చైనా వారి యుద్ధం. 'హం దోనో ', 'సినిమా యుద్ధం ప్రాధాన్యం కల సినిమా కాదు. 'ఏక్ ముసాఫిర్, ఏక్ హసీనా ' సినిమా, నేపథ్యం, దేశ స్వతంత్రం సాధించగనే కాశ్మీరును ఆక్రమించేందుకు దాడి చేసిన పాకిస్తాన్ ముష్కరులతో ఆరంభమయినా, సినిమా ప్రధానంగా ప్రేమ కథ. అందుకే 1964లో చేతన్ ఆనంద్ దర్శకత్వం వహించి నిర్మించిన 'హకీకత్ ' సినిమా, భారతదేశంలో యుద్ధం కేంద్రంగా నిర్మితమైన తొలి సినిమా. భారత్, చైనా యుద్ధం ఈ సినిమాకు కేంద్రబిందువు. సినిమా పూర్తిగా యుద్ధం చుట్టూ నడుస్తుంది . అంటే ఫస్ట్ వార్ మూవీ అన్నమాట హకీకత్.

'హకీకత్ ' సినిమా ప్రత్యేకత ఏమిటంటే, సినిమా వీలయినంతగా నిజానికి, దగ్గరగా ఉంటుంది. సైనికుల జీవితాన్ని గ్లామరైజ్ చేయటం, దేశభక్తిని మరీ అతిశయోక్తిలా ప్రదర్శించటం వంటివేవీ ఉండవు. తగినంత నాటకీయత, తగు మోతాదులో కల్పనలు ఈ సినిమాను ఇతర సినిమాలకు వేరుగా నిలుపుతాయి.

'హకీకత్ ' సినిమాకు సంగీత దర్శకత్వం మదన్ మోహన్. చేతన్ ఆనంద్ సినిమాలన్నిటికీ, మధ్యలో 'ఆఖ్రీఖత్ ' సినిమా ఒకటి వదిలేస్తే, మదన్ మోహన్ పరిచయమైన తరువాత, ఆయన మరణించే వరకూ, మరో సంగీత దర్శకుడితో పని చేయలేదు చేతన్ ఆనంద్. సినిమాకు సంగీత దర్శకుడు మదన్ మోహన్ అయితే గేయ రచయిత కైఫీ ఆజ్మీ.

కైఫీ ఆజ్మి పేరున్న కవి. అతి చక్కటి గీతాలు రాశాడు. కానీ ఇలాంటి గీతం రాసింది ఆయన ఒక్కడే. ఆ తరువాత మళ్ళీ ఇలాంటి గీతం ఆయన కూడా రాయలేదు.

హిందీ సినిమాల్లో విరహగీతాలెన్నో ఉన్నాయి. వేరయిన నాయికా నాయకులు ఒకరినొకరు తలచుకుంటూ ఏడుస్తూ పాడేపాటలు ఎన్నో ఉన్నాయి. నాయికను వదలి వెళ్తూ నాయకుడు, నాయకుడిని వదలివెళ్తూ నాయికలు పాడే పాటలెన్నో ఉన్నాయి. కానీ, నాయిక తనను వెనక్కు పిలుస్తుందన్న ధీమాతో ఆమెని వదలి వచ్చి, ఎదురుచూస్తూ, చివరికి ఆమె పిలవదని, ఆమెకు తాను శాశ్వతంగా దూరమయ్యాననీ గ్రహించి, తీవ్రమైన నిరాశా నిస్పృహలతో, దుర్భరమైన వేదనతో, పస్చాత్తాపంతో పాడే పాట ఇదొక్కటే!

ఉర్దూ ప్రపంచంలో 'నజ్మ్' ఒక ప్రత్యేక రచనా ప్రక్రియ. దీనికి పాటలా, పల్లవి, చరణాలుండాలన్న నియమంలేదు. లయ అవసరంలేదు. ప్రాసతో పనిలేదు. ఘజల్ లా షేర్లు, కాఫియా, రదీఫ్ లుండాలన్న ప్రతిబంధకాలులేవు. హిందీ సినీప్రపంచంలో అలాంటి ఒక అరుదైన 'నజ్మ్' ఈ పాట.

ఈ పాటను కైఫీ ఆజ్మీ 1956లో విడుదలయిన 'పంచాయత్' అనే సినిమా కోసం రాశాడు. పాట రికార్డయింది. కానీ అప్పటికే పది పాటలుండటంతో ఈ పాటను సినిమాలోంచి తొలగించారు. 'హకీకత్' సినిమాలో సందర్భం కుదరటంతో ఆ పాటను ఇక్కడ వాడేరు.

సినిమాలో ఒక సైనికుడు పాడతాడీపాట. చిన్న గొడవ పెట్టుకుని ప్రేయసిని వదలి వచ్చేస్తాడాసైనికుడు. ఆమె తనను వదలి ఉండలేదని, తనను వెనక్కు పిలుస్తుందనీ, ఉత్తరం రాస్తుందనీ ఎదురుచూస్తూంటాడు. వాళ్ళ పోస్టింగ్ హిమాలయాల్లో. ఆకాలంలో వారానికోసారి వచ్చే పోస్ట్ తప్ప మరోరకంగా సమాచారం తెలిసే వీలుండేది కాదు. ఉత్తరాలు వచ్చే రోజు ఎదురుచూడటం, అందరికీ ఉత్తరాలు వస్తూంటే, తాను చూస్తూండిపోవటం, అందరూ సంతోషిస్తూంటే, తాను విషాదంతో మిగిలిపోవటం జరుగుతూంటే, అతనికి అర్ధమయిపోతుంది, ఇక ఆమె తనకు దూరమైపోయిందని.

తనకి సమాధానం రాయదని ఆమె తనకు ఎప్పటికీ దూరమైపోయిందన్న చేదు నిజాన్ని గ్రహించిన క్షణంలో అతని మనసు విరిగిపోతుంది. ఉత్తరాలు చదువుతూ ఆనందిస్తున్న తోటి సైనికులందరికీ దూరంగా వెళ్తాడు. చుట్టూ అందమైన హిమాలయ పర్వతాలు. అందమైన విశాలమైన ఆకాశం. ఆ విశాలత్వం, అనంతత్వం క్రింద ఒంటరిగా అతడు ఒక్కడే ఓ రాయి మీద కూర్చుని లేక విషాదాన్ని గానం రూపంలో ప్రకటించటం ఈ పాట.

**మై యే సోచ్ కర్ ఉస్కె దర్ సే ఉఠా థా**

**కె వో రోక్ లేగీ, మనాలేగి ముఝ్ కే**

**హవా వోమె లహరాత ఆతా థ దామన్**

**కె దామన్ పకడ్ కర్ బిఠాలేగి ముఝ్ కో**

**కదం ఐసె అందాజ్ సే ఉఠ్ రహేథే**

**కె అవాజ్ దేకర్ బులా లేగి ముఝ్ కో**

ఇంతవరకూ పాట మొదటి భాగంగా భావించవచ్చు. ఆమెని వదలి వస్తున్నప్పుడు అతను ఏమని భావించాడో అది చెప్తుంది పాట ఇక్కడి వరకూ.

ఆమె ఇల్లు వదలి వచ్చేటప్పుడు, ఆమె అతడిని వెళ్లవద్దని ఆపుతుందనీ, బ్రతిమిలాడి బుజ్జగించి ఆపేస్తుందనీ అనుకున్నాడు. అతడి చేయి పట్టుకుని తన దగ్గరే కూర్చోబెట్టుకునేట్టు ఆమె చేయి కదిలిందని, ఆమె అదే చేస్తుందనీ అనుకున్నాడు. ఆమె కాళ్లు ఎలా కదిపిందంటే, ఆమె అతడిని వెనక్కు పిలుస్తుందని అనుకున్నాడు. అలా అనుకుని ఆమెని వదలి వచ్చేశాడు.

పాటను 'మిశ్రపీలూ' రాగంలో రూపొందించాడు మదన్ మోహన్. సాధారణంగా 'పీలూ రాగాన్ని రొమాంటిక్ సందర్భాలలో పాడతారు సినిమాలో. కానీ 'పీలూ' రాగంలో అద్భుతమైన విషాదగీతాలు కూడా రూపొందాయి. 'అబ్ కె బరస్ భేజ్ భయ్యాకో బాబుల్ ' (బందినీ), తెరెబిన్ సూనీ నయన్ హమారీ (ఓ మేరీ సూరత్ తేరీ ఆంఖే) ఆయేన బాలం (షబాబ్) వంటి విషాదగీతాలు ఇందుకు కొన్ని ఉదాహరణలు. పాట ప్రభావాన్ని మరింత తీవ్రం చేసేందుకు మదన్ మోహన్ 'పీలూరాగ' సూత్రాలను కాస్త అటూ ఇటూ చేశాడు.

కానీ, పాట 'ఆర్కెస్ట్రా' విషయంలో మదన్‌మోహన్‌ను అభినందించక తప్పదు. పాట తీవ్రమైన విషాదగీతం. పైగా ఒంటరిగా హిమాలయ పర్వత ప్రాంతంలో పాడే పాట. అందుకని పాటలో ఒకే వాయిద్యం వయోలిన్ మాత్రమే వాడాలని అనుకున్నాడు.

ఆరంభంలో ఎనిమిది వయొలిన్లు వాడాలనుకున్నాడు. కానీ పాట ఒక్కటే ఒంటరిగా పాడుతున్నాడు విషాదంగా. పైగా, మంద్రస్థాయి పాట. అందుకని ఒకే ఒక్క వయోలిన్‌ను మాత్రమే వాడాలని నిశ్చయించాడు. అంటే రికార్డింగ్‌లో ఒక వయొలిన్ వాయిద్యకారుడు, గాయకుడు తప్ప మరెవరూ ఉండవన్నమాట. ఒకే ఒక్క వయోలిన్ వాడటంతో, పాటలోని

వేదన, ఒంటరితనం మరింత తీవ్రమయ్యాయి. వయొలిన్ మోగటం కూడా విషాదం ఉట్టి పడుతూ, ఒక్కొక్క 'నోట్'ను వదలలేక వదులుతూన్నట్టు, నోట్‌ను ధ్వనిస్తూ కూడా ఏడుస్తున్నట్టు మోగుతుంది. రఫీ కూడా విషాదం గొంతులో ఉట్టి పడుతూంటే, ప్రతి పదాన్ని ఏదో ఆలోచిస్తూ, ఏడుపును దిగమ్రింగుకుంటూ, తన బాధను ప్రదర్శించటం ఇష్టం లేకపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో బాధను, బయటపెడుతున్నట్టు, ఒకో పదాన్ని ఎన్నో భావాలతో కలిపి పలుకుతాడు రఫీ. ఒక రకంగా వయోలిన్, రఫీ స్వరం నడుమ 'జుగల్ బందీ 'లాంటిది ఈ పాట.

ఇక పాట రెండో భాగం, ఎలాంటి ఇంట్ర్ల్యూడ్ సంగీతం విరామం లేకుండా కొనసాగుతుంది. ఇక్కడ కూడా 'మగర్' అంటూ ఆరంభంలోనే తీవ్రమైన నిరాశను, వేదనను ప్రర్శిస్తాడు రఫీ. ఇదెలాగంటే ఒక వ్యక్తి 'నేను అలా అనుకున్నాను, ఇలా అనుకున్నాను' అంటూ చెప్పేటప్పుడు ఒక రకంగా చెప్తాడు, అదే 'అది కాలేదు, ఇది కాలేదు. చివరికి అంతా అయిపోయింది' అని చెప్పేటప్పుడు చెప్పే విధానం మరో రకంగా ఉంటుంది .ఆశ పూర్తిగా పోయినప్పుడు ఇంకో రకంగా ఉంటుంది. అదంతా ప్రతి పదంలో ప్రదర్శిస్తాడు రఫీ.  ప్రతి పదాన్ని పలకటంలో ఎంతో తేడా చూపిస్తాడు. 'హై పిచ్' కు వెళ్ల గలిగి కూడా, ఆ పిచ్‌లోకి వెళ్లకుండా అదిమి పెట్టి పాడటం, అగ్ని పర్వతంలా బ్రద్దలయ్యే వేదనను అణచి పెట్టి, అదుపులో ఉంచాలని చేస్తున్న ప్రయత్నాన్ని ప్రదర్శిస్తుంది. అత్యద్భుతమైన గాన సంవిధానం ఇది.

**మగర్ ఉస్నే రోకా  న ఉస్నే మనాయా**

**న దామన్  హి పక్డా, న ము ఝ్ కో బిఠాయా**

**న అవాజ్ హీ దీ, న వాపస్ బులాయా**

నిజానికి గేయ రచనలో కైఫీ ఆజ్మీ ఎలాంటి అద్భుతమైన భావాలు ప్రదర్శించలేదు. మాములు మాటలతో మామూలు ఘటనను మామూలుగా వర్ణించాడు. ఆమె వెనక్కు పిలుస్తుందనుకున్నాను. పిలవలేదు. రమ్మంటూందనుకున్నాడు . రమ్మనలేదు. ఆయన రాసింది ఇంతే. కానీ సందర్భంలో ఒదగటం, దానికి బాణీ, వయొలెన్, రఫీ,  చిత్రీకరణ అన్నీ కలసి మాములు మాటలను ఎంతో వేదనా పూరితమైన పదాలుగా మార్చాయి.

ముందు ఆమెని వదలి వచ్చేప్పుడు తాను ఏమనుకున్నాడో చెప్పాడు. అలా అనుకున్నదొక్కటి ఏమయిందో ఇప్పుడు చెప్తున్నాడు. ఆమె ఆపలేదు. ఆమె అతడిని వెనక్కు పిలవలేదు. చేయి పట్టుకుని ఆపలేదు. దగ్గిర కూర్చోబెట్టుకుని బుజ్జగించలేదు. వెనక్కురా అని అనలేదు. వాపస్ పిలవలేదు. తరువాత ఏమయిందో కూడా చెప్తున్నాడు. ఇప్పుడు రఫీ పాడే

విధానం కూడా మారుతుంది. న 'అవాజ్ హీదీ ' అని హై పిచ్ కి వెళ్లే రఫీతో స్పందిస్తుంది వయోలిన్. అద్భుతం అనిపిస్తుంది.

**మై అహిస్త అహిస్త బఢ్ తాహి ఆయా**

**యహాన్ తక్ కె ఉస్ సె జుదా హోగయా మై**

**జుదా హోగయా మై జుదా హో గయామై**

ఆమె పిలుస్తుందనుకున్నాడు. పిలవలేదు. పిలుస్తుందేమోనని నెమ్మది నెమ్మదిగా నడుస్తూ వచ్చాడు. ముందుకు వస్తూనే ఉన్నాడు ఆమెని వదలి. ఎంతగా ముందుకు వచ్చేశాడంటే ఆమెతో పూర్తిగా విడిపోయేంతగా. మళ్లీ కలవలేనంతగా, చివరికి 'జుదా హో గయామై' అని రఫీ పదే పదే అంటూంటే బాధ అలలు అలలుగా గాలిలో ఎగస్తూ, దూరమై, నిశ్శబ్దమై పోయిన భావన కలుగుతుంది. పాట మొత్తం ఒక వ్యక్తి ఆశ, నిరాశ అయి, నిర్జీవమైపోటాన్ని రెండున్నర నిమిషాల్లో ప్రదర్శిస్తుంది. జుదా హోగయా మైన్ అని రఫీ ఒక్కోసారి అంటున్నాకొద్దీ పెరిగిపోతున్న నిరాశ తెలుస్తుంది. ఒక వ్యక్తి కొన ఆఖరి శ్వాస వదలివెళ్ళిపోవటం తెలుస్తుంది. ఒక జీవిత కథను రెండు నిమిషాల్లో కళ్లకు కదుతుందీ పాట. ఇంతే జీవితం! గాలిలో కలసి పోయే ఒక శబ్దతరంగం. మనిషి జీవితగాథను, 'పుట్టాడు, ఏడ్చాడు, పోయాడు' అని చెపితే చాలు అంటాడో తత్వవేత్త. ఆ భావనను ఎంతో దయనీయంగా, హృదయం ద్రవించే రీతిలో ప్రదర్శిస్తుంది ఈ పాట.

ఈ పాట 'సుధీర్' అనే నటుడిపై చిత్రించారు. ఈ పాటలో వయోలిన్ వాయించింది, తరువాత లక్ష్మీకాంత్ ప్యారేలాల్ జంటలో ఒకడయిన ప్యారేలాల్ ఈ ప్రేరణతో ఆయన తరువాత 'ఎక్ ప్యార్ క నగ్మా హై' పాటలో వయోలిన్ కదలికలను నిర్దేశించాడు.

'హకీకత్' సినిమా ప్రత్యేకత ఇదే. సైనికులనగానే దేశం కోసం సర్వం త్యాగం చేసే సూపర్ మేన్లన్నట్టు గ్లామరస్ గా చూపించటం ఆనవాయితీ. కానీ, చేతన్ ఆనంద్ సినిమాలో సైనికులు కూడా మామూలు మనుషులే. మామూలు మనుషుల్లాగే వారికీ ఆనంద విషాదాలు, బాధలూ వేదనలూ వుంటాయి. కానీ, అసాధారణ పరిస్తితుల్లో, అసాధారణమైన ధైర్యానీ, తెగింపునూ, దేశంకోసం సర్వం త్యాగం చేసే పట్టుదలనూ ప్రదర్శించే దేశభక్తి వారిది. ఇదీ చూపిస్తుంది 'హకీకత్' సినిమా. అందుకే, అన్ని వార్ సినిమాలకూ భిన్నంగా ఉన్నతంగా నిలుస్తుంది. సైనికులు దేశభక్తులు కాదు, జీతగాళ్ళు అని

వాదించే దుర్బుద్ధులకు ఈ సినిమా తప్పనిసరిగా చూపించాలి. సైనికులు రేపిస్టులు అని ఈసడిస్తూ, దేశభక్తిని పాలలా విరగ్గొట్టుకునేవాళ్ళంతా ఈ సినిమా చూస్తే, సైనికులూ వీళ్ళలాంటి మనుషులేననీ, వీళ్ళలాగా ఇళ్ళల్లో కూర్చుని విచ్చిన్నకరవాదనలు చేసేబదులు, అమాయక ప్రజల ప్రాణాలకోసం తమ ప్రాణాలు పణంగా పెట్టేందుకు సిద్ధపడిన దేశభక్తులనీ అర్ధమవుతుంది.

'మై యే సోచ్ కర్' లాంటి పాట ఈనాటి సినిమాల్లో ఊహించలేము. సినిమా సాంకేతికంగా, వ్యాపార పరంగా అభివృద్ధి చెందుతూ 'మనిషిని, అతని సంవేదనలను' ఎక్కడో వదిలేసి ముందుకు వెళ్లిపోయింది. ఇప్పటి సినిమాల్లో మనుషులు కనబడరు. ఒకప్పుడు సినిమాల్లో మనుషులు, ఆవేదనలు, సంవేదనలు, బాధలు, ఆనంద విషాదాలు ఉండేవనేందుకు నిదర్శనంగా ఆనాటి పాటలున్నాయి. ఒకప్పుడు మనుషులు నిజాయితీగా తీవ్రంగా ప్రేమించేవారని, పరస్పరం గౌరవించుకునే వారనే నిజానికి నిరూపణగా మృదువైన భావనల సినీపాటలున్నాయి. వాటిని స్మరించటం యువతరానికి పరిచయం చేయటం కోసమే 'మ్యూజికల్ మ్యూజింగ్స్ '.

(వచ్చే నెల మరిన్ని పాటలతో)

Click here to share your comments on this story